సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



నిమ్మ కేరాఫ్ అమ్మపాలెం

జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామం నిమ్మ సిరులు కురిపిస్తోంది. రైతులు నిమ్మ సాగుపై మొగ్గు చూపుతున్నారు.

8లో



యాంటీ బయోటిక్‌తో ముప్పు

పశువులకు చేసే వైద్యంలో మోతాదుకు మించిన యాంటీ బయోటిక్స్ వాడకంతో ముప్పు తప్పదని వైద్యులు అంటున్నారు.

8లో



విధి నిర్వహణలో హెచ్‌సీ మృతి

విధి నిర్వహణలో భాగంగా వెళుతుండగా ఎర్రకాలువలో కొట్టుకుపోయి ఓ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందారు.

8లో

న్యూస్‌రీల్

ఏలూరు వైఎస్సార్ కాలనీలో హత్య



ఏలూరు జీజీహెచ్‌లో రోదిస్తున్న మృతుడి బంధువులు

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ పాలగూడెం పంచాయతీ వైఎస్సార్‌కాలనీలో పట్టపగలే ఇంట్లో నుంచి బయటకు పిలిచి ఓ వ్యక్తిని కత్తితో నరికివేశారు. బాధితుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. వైఎస్సార్ కాలనీకి చెందిన పునూరు రాజేష్ (42)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన బూరుగు నాని అలియాస్ చిన్ని నాని అలియాస్ విజయ్ కుమార్ అనే వ్యక్తి గతంలో ఉన్న పరిచయంతో రాజేష్‌ను ఇంటిలో నుంచి పిలిచి బయటకు తీసుకువచ్చాడు. సమీపంలోని చర్చి వద్దకు రాగా నానితోపాటు మరో ముగ్గురు రాజేష్‌పై కత్తులతో దాడి చేశారు. తల, మెడ, ఛాతీపై కత్తులతో నరికారు. రాజేష్ కేకలు వినిపించటంతో అతడి కుమారుడు, కుమార్తె, చెల్లెలు పరుగెత్తుకుంటూ రాగా అప్పటికే సిద్ధంగా పెట్టుకున్న కారులో నిందితులు పరారయ్యారు. తీవ్రగాయాలతో ఉన్న రాజేష్‌ను జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినా ఫలితం లేదు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన నిందితుడు నానిగా పోలీసులు గుర్తించటంతో పరారీలో ఉన్న వారందరినీ పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు చెబుతున్నారు. హత్యలు, నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వరద బాధితులకు లైఫ్ జాకెట్లు



కనకాయలంకలో లైఫ్ జాకెట్లు వేసుకుని కాజ్‌వే దాటుతున్న గ్రామస్తులు

సాక్షి స్పందన

యలమంచిలి: కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. అయితే వరద నీటిలో పడవపై ప్రయాణిస్తున్న వారికి లైఫ్ జాకెట్లు ఇవ్వకపోవడంపై శనివారం 'సాక్షి'లో 'రక్షణ చర్యలు శూన్యం' శీర్షికన వచ్చిన కథనానికి మండల మత్స్యశాఖాధికారి ఏడుకొండలు స్పందించారు. కాజ్‌వే దాటే ప్రతి ఒక్కరికీ ఆయన లైఫ్ జాకెట్లు వేయించి పడవ ఎక్కించి కాజ్‌వే దాటించారు.

త్వరలో బస్సుల పునరుద్ధరణ



ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలకు నరసాపురం, భీమవరం ఆర్టీసీ డిపోలకు చెందిన పలు సర్వీసులను రద్దు చేయగా ప్రయాణికుల ఇబ్బందులపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన 'ఉచిత బస్సు.. ప్రయాణం తుస్సు' కథనానికి ఏలూరు ప్రజారవాణా శాఖ అధికారి ఎస్‌కే షబ్నం స్పందించారు. పశ్చిమగోదావరి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్, ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్లతో ఆమె చర్చించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. త్వరలో రద్దయిన భీమవరం, నరసాపురం బస్సు ట్రిప్పులను యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న రోజుల్లో ప్రత్యేక బస్సు సర్వీసులను పెంచాలని, ఆయా రోజుల్లో ఒక ట్రాఫిక్ సూపర్‌వైజర్‌ని ద్వారకాతిరుమలలో ఉంచి రద్దీని క్రమబద్ధీకరించాలని ఆదేశించామన్నారు.

4న కోకో రైతుల సదస్సు

పెదవేగి: కోకోకు అంతర్జాతీయ ధర కల్పించకుండా కంపెనీలు మోసం చేస్తున్నాయని ఏపీ కోకో రైతుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయరాయిలో రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు విజయరాయిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ఏర్పాటుపై కోకో రైతుల రాష్ట్ర అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, నాబార్డ్, ఉద్యాన శాఖ అధికారులు, ప్రముఖులు హాజరుకానున్నారన్నారు.

చేపా.. చేపా.. ఎందుకు పడలేదు?

'మా చిన్నతనంలో.. సాయంత్రం పూట పిల్ల కాలువలో పందిరి మావు కట్టి ఉదయం తీసి చూస్తే రకరకాల చేపలు, రొయ్యలు, పీతలు బోలెడు ఉండేవి. ఇప్పుడు చూద్దామంటే కాలువల్లో ఎక్కడా వాటి జాడే ఉండటం లేదు..' ఇది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన గంటి మోహనరావు **ఆవేదన.**

'అప్పట్లో.. కాలువ గుం**తల్లో వల వేస్తే బుట్టడు చేపలు పడేవి. వాటిని అమ్ముకుంటే రోజు గడిచిపోయేది. ఇప్పుడు రోజంతా కష్టపడ్డా బుట్ట నిండటం లేదు'** అంటూ **బాధపడు**తున్నాడు పశ్చిమగోదా**వరి జిల్లా** భీమవరం రూరల్ గొల్ల**వానితిప్పకు** చెందిన మత్స్యకారుడు **నాగరాజు.**



ఇసుక దొంతులు



మట్ట గిడసలు



బొమ్మిడాయిలు



కొర్రమీనులు

- కాలుష్య కాసారాల్లో కలిసిపోతున్న డెల్టా సహజ మత్స్య సంపద
- ఆక్వా, వరి సాగులో విచ్చలవిడిగా క్రిమిసంహారకాల వినియోగం
- జాడ లేని బొమ్మిడాయి, మట్టగిడస, కొర్రమీను, చాక రొయ్య, గొరస
- ఉపాధి కోల్పోయామంటున్న మత్స్యకారులు

సాక్షి, భీమవరం: బొమ్మిడాయి**లు, కొర్రమీనులు,** పీతలు, పిత్త పరిగెలోయ్.. ఈ **మాటలు వినగానే** మాంసాహార ప్రియుల నోరూ**రుతుంది. జలచర** వంటకాల్లో వీటికున్న ప్రత్యేకత **అలాంటిది. రెండు** దశాబ్దాల క్రితం వరకు గోదా**వరి, కృష్ణా డెల్టాలోని** పంట కాలువలు, బోదెలు, **వాగులు, డ్రెయిన్లు,** కొల్లేరులో పండుగప్ప, కొర్ర**మీను, బొమ్మిడాయి,** మట్టగిడస, కట్టిపరిగె, గొరస, ఇలంబ్రాయి, బెత్తు, ఇసుక దొంతు, సావిడాయ, మలిగ పాము, మార్పు తదితర చేపలు, చాక రొయ్యలు తదితర వందకు పైగా జాతుల మత్స్య సంపద పుష్కలంగా ఉండేది. కాలువల్లో సహజసిద్ధంగా పెరిగే వీటిలో ఎన్నో రోగాలను నయం చేసే గుణముంటుందని పెద్దలు అంటారు. వీటికున్న డిమాండ్‌తో వేల మంది మత్స్యకారులు కాలువల్లో చేపల వేటపై ఆధారపడి జీవించేవారు. వీటిని ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హర్యానా తదితర ప్రాంతాలకూ ఎగుమతి చేసేవారు.

కాలుష్యభరితం

ఉభయ గోదావరి, కృష్ణా డెల్టాలో 8.44 లక్షల ఎకరాల్లో వరి, 3.72 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతున్నాయి. అధిక దిగుబడుల కోసం అధికంగా ఎరువులు, క్రిమిసంహారకాలు వాడుతున్నారు. ఈ నీటితోపాటు పరిశ్రమల నుంచి శుద్ధి చేయని జలాలు కాలువల్లోకి చేరి నీటిని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్, అమోనియా, హానికారక రసాయనాలు నీటి అడుగుకు చేరి ఆక్సిజన్‌ను హరిస్తున్నాయి. దీంతో సహజ మత్స్య సంపద నశించి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతింటోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమ డెల్టాలోని గోస్తనీ, బ్యాంక్, వెంకయ్య వయ్యేరు, వేల్పూరు కాలువలు అత్యంత కాలుష్యభరితంగా ఉన్నట్టు భీమవరంలోని నీరు–పర్యావరణ పరిశోధన కేంద్రం చేసిన పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిస్థితి కొనసాగితే డెల్టా ప్రాంతంలో సహజసిద్ధమైన చేపలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదముంది.



గోదావరి పశ్చిమ డెల్టా కాలువల్లో నీటి కాలుష్యంపై గతంలో భీమవరంలోని వెట్ సెంటర్ రూపొందించిన చిత్రం (ఫైల్)

జాడ లేకుండా పోతున్నాయి

తీర ప్రాంతం, డెల్టా కాలువలు, బోదెల్లో పుష్కలంగా దొరికే ఈ చేప జాతుల్లో కొన్ని మార్కెట్లకు అరుదుగా వస్తుండగా మరికొన్ని మచ్చుకైనా కనిపించడం లేదు. చెరువుల్లో పెంచే బొచ్చె, రాగండి, శీలావతి తదితర రకాలు కిలో రూ.100 వరకు ఉంటే కాలువల్లో దొరికే కొర్రమీను రూ.500 నుంచి రూ.700 వరకు ఉంటుంది. బొమ్మిడాయిలు సైజును బట్టి రూ.300 నుంచి రూ.700 వరకు ఉంటున్నాయి. కాలువల్లో చేపల వేట కోసం గతంలో రూ.10 లక్షలకు పైగా జరిగిన వేలం పాటలు ఇప్పుడు రూ.2 లక్షల లోపే ఉంటున్నాయని మత్స్యకారులు అంటున్నారు. జల కాలుష్యంతో ఉపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొర్రమీను, పండుగప్ప తదితర చేపలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా కొందరు చెరువుల్లో పెంచుతున్నా, సహజసిద్ధంగా కాలువల్లో దొరికే వాటితో పోలిస్తే చెరువు చేపలకు అంత రుచి ఉండటం లేదంటున్నారు.

ప్రక్షాళన చేయాలి



తీవ్ర నీటి కాలుష్యం వల్ల **జల చరాల ఉనికికి ము**ప్పు **తో పాటు వాటిలో** పునరు**త్పత్తి సామర్థ్యం తగ్గిపో**తుంది. **భవిష్యత్ అవసరా**ల దృష్ట్యా **కాలువల్లో కాలుష్యా**న్ని **ప్రక్షాళన చేయాల్సిన అ**వసరం ఉంది.

– పీఏ రామకృష్ణంరాజు, రిటైర్డ్ ప్రొఫెసర్, నీరు–పర్యావరణ నిపుణుడు, భీమవరం

ఉపాధి కోల్పోయాం



రెండు దశాబ్దాల క్రితం మా గ్రామంలోని ఎంతోమంది మత్స్యకారులు ఈ వేట ద్వారా ఉపాధి పొందేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కాలువల్లో గాలిస్తున్నా ఎక్కడా చేపలు పడటం లేదు.

– రేవు నరసింహస్వామి, మత్స్యకారుడు, దొంగపిండి

స్నేహపూర్వక వాతావరణం ముఖ్యం



భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన శాంతి కమిటీలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో స్నేహపూర్వక వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వినాయక ఊరేగింపులు, నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి గొడవలకు తావులేకుండా ఉండాలన్నారు. పందిళ్లు, నిమజ్జనాల సమయాల్లో డీజే సౌండ్‌లకు అనుమతులు లేవన్నారు. జిల్లా ఎస్పీ, పీస్ కమిటీ వైస్ చైర్మన్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ నిమజ్జనం, ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తితే సహకరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పటిష్ఠ భద్రతకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు మాట్లాడారు. డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీఓలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

వీసీ నియామకంలో పితలాటకం

- ఆగస్టు 31తో ముగిసిన ఉద్యాన వర్సిటీ వీసీ పదవీ కాలం
- కొత్త వీసీని నియమించని ప్రభుత్వం
- తననే కొనసాగించాలని కోర్టును ఆశ్రయించిన ప్రస్తుత వీసీ గోపాల్



ఉద్యాన వర్సిటీ ముఖద్వారం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కొత్త వీసీ నియామకంలో పితలాటకం మొదలైంది. ప్రస్తుత వీసీ డాక్టర్ కె.గోపాల్ ఉద్యోగ కాలం ఆదివారంతో ముగిసింది. వాస్తవానికి తదుపరి వీసీ ఎవరనేది ప్రభుత్వం శుక్రవారమే నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా అది జరగలేదు. వీసీ గోపాల్ ఉద్యోగ కాలాన్ని అయినా పొడిగించాలి లేదా ఇన్‌చార్జి వీసీని నియమించాలి. అయితే ఇవి కూడా జరగలేదు. దీంతో తననే వీసీగా కొనసాగించాలని ప్రస్తుత వైస్ చాన్సలర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయాన్ని ఈనెల 26కి వాయిదా వేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

వీసీ వాదనేంటంటే..

వీసీగా వచ్చే వ్యక్తిని ఉన్నత విద్యాశాఖకు చెందిన వ్యక్తిగా పరిగణించాలని, వారికి మాదిరిగానే వయసును 62 నుంచి 65 ఏళ్లకు పరిగణనలోకి తీసుకుని తనకు 65 ఏళ్లు వచ్చే వరకు కొనసాగించాలని వీసీ గోపాల్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. గోపాల్ 1987లో అసిస్టెంట్ రీసెర్చ్ అధికారిగా అప్పటి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేరారు. అనంతరం ప్లాంట్ పథాలజీ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. 2007లో ఉద్యాన వర్సిటీలో ప్రవేశించి వీసీ స్థాయికి ఎదిగారు. ఈ నేపథ్యంలో ఆయన పదవీ కాలంలో ఆగస్టు 31తో ముగిసింది. ఉన్నత విద్యాశాఖ జీఓ 39 ప్రకారం విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లుగా పెంచినట్టుగా సూపర్ రెన్యూయేషన్ పద్ధతిన ప్రొఫెసర్‌గా ఉన్న తనకూ ఈ జీఓ వర్తింపజేయాలని కోరారు. వాస్తవానికి జీఓ 39 ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాశాఖలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కింద పనిచేసే అధ్యాపకులకు మాత్రమే వర్తిస్తుంది. ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రొఫెసర్లకు వర్తించదు. ఉద్యాన వర్సిటీ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ పరిధిలోకి వస్తారు. వీరికి వేతనాలను ప్రభుత్వమే ఇస్తుంది. యూజీసీ వేతనాల పరిధిలోకి రారు కాబట్టి ఈ రిట్‌పై దఖలు చేసిన వ్యక్తి కౌంటర్ అఫిడవిట్‌ను ఈనెల 29న దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. దీంతో వీసీ గోపాల్‌కు ఊరట దొరకలేదు. మొత్తంగా ఉద్యాన వర్సిటీ వీసీ నియామకంలో డైలమా కొనసాగుతోంది.

ఆప్కాస్ ఆపరేటర్ లైంగిక వేధింపులు

- కమిషనర్‌కు మహిళా ఉద్యోగి ఫిర్యాదు
- విచారణకు ఆదేశం



తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఆప్కాస్ ఆపరేటర్ బాలా మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడటం కలకలం రేపింది. మున్సిపల్ కార్యాలయంలో ఓ సెక్షన్‌లో చిరుద్యోగం చేస్తున్న మహిళను తాజాగా వేధించడంతో ఆమె శనివారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా బాలా బాధిత మహిళా ఉద్యోగులు సోమవారం మూకుమ్మడిగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

అధికారుల అండదండలతోనే..!

మహిళా ఉద్యోగులు లక్ష్యంగా బాలా వేధింపులకు పాల్పడటం, ఇందుకు కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నట్టు తెలిసింది. మెసేజ్‌ల ద్వారా వేధించే పర్వం ఓ దశలో సహాయక మహిళా ఉన్నతాధికారిని కూడా ఇబ్బంది పెట్టే స్థాయికి వెళ్లిందని సమాచారం. దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేస్తున్న బాలా అధికారులను లోబర్చుకుని వేధింపుల పర్వం కొనసాగిస్తున్నాడు. కోవిడ్ సమయంలో మున్సిపాలిటీ నుంచి ఆస్పత్రి వద్ద విధులకు, ఆ తర్వాత తాళ్లముదునూరుపాడులో హైస్కూల్‌కు బదిలీ అయ్యాడు. అతడి చీకటి వ్యవహారాలకు బాసటగా నిలిచే ఓ మహిళా ఉద్యోగి సహకారంతో తిరిగి మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చినట్టు సమాచారం. సదరు మహిళా ఉద్యోగిని వేరే మున్సిపాలిటీకి బదిలీ కాగా బాలాను కోవర్టుగా వాడుకుంటున్నట్టు తెలిసింది. అలాగే మరికొందరు అధికారుల అండదండలు బాలాకు పుష్కలంగా ఉన్నాయి. దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేయడంతో బాలా ఓ వర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు. మరో ఉద్యోగితో కలిసి మహిళా ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల బాలోత్సవం జరిగిన రోజు రాత్రి ఓ మహిళా చిరుద్యోగినికి వేధింపులకు గురిచేసేలా మెసేజ్ పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

లోతైన దర్యాప్తు చేస్తాం

మున్సిపల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న బాలా అనే వ్యక్తి తనను మెసేజ్‌ల ద్వారా వేధిస్తున్నట్టు మహిళా ఉద్యోగి ఒకరు ఫిర్యాదు చేశారు. ఆమెను, బాలాను కార్యాలయ మేనేజర్ సమక్షంలో విచారణ చేశాం. సారీ.. ఆమె నాకు చెల్లి వంటిది, ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగవంటూ బాలా వివరణ ఇచ్చారు. ఈ విషయంపై లోతైన దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం.

– ఎం.ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం

కూటమి పాలనలో పెచ్చుమీరిన దౌర్జన్యాలు

పినకడిమి సర్పంచ్ భర్త శ్రీనివాసరావు



దాడిలో గాయపడిన పలగాని శ్రీనివాసరావు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వల్ల తమకు ప్రాణహాని ఉందని పెదవేగి మండలం పినకడిమి సర్పంచ్ సునీత భర్త పలగాని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే చింతమనేని, ఆయన గన్‌మన్, మరో వ్యక్తి రవి దౌర్జన్యంగా తన పొలంలోకి వచ్చి అన్యాయంగా దాడి చేయడంతో పాటు తమపైనే కేసు పెట్టడం ఎంతవరకు న్యాయమని కన్నీటిపర్యంతమయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో బలమైన గౌడ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ భర్తపై దాడి, దౌర్జన్యం చేయడమే కాకుండా వారు సాగు చేసుకుంటున్న పొలాన్ని ఆక్రమించాలని చూడటం విచారకరమన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా టీడీపీ అధిష్టానం చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న సర్పంచ్ దంపతులకు చెందిన భూమిలోకి ఎమ్మెల్యేగానే వెళ్లాల్సిన అవసరం ఏమిటని, ఏకంగా మహిళా సర్పంచినే స్పృహ కోల్పోయేలా కొడితే గ్రామస్తులకు, నియోజకవర్గ ప్రజలకు రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. పెదవేగి ఎంపీపీ తాత రమ్యశ్రీ మాట్లాడుతూ మహిళా సర్పంచ్‌పై, ఆమె భర్తపై జరిగిన దాడి, దౌర్జన్యం బాధాకరమన్నారు. దీనిని గౌడ సామాజిక వర్గ మహిళలపై జరిగిన దాడిగా తాము భావిస్తున్నామని స్పష్టం చేశారు. దెందులూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మట్ట రమాశంకర్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గన్‌మన్, మరో వ్యక్తి చేసిన దాడి, దౌర్జన్యం, దు ర్భాషలు సభ్య సమాజానికి, ప్రజాస్వామ్యానికి సి గ్గుచేటన్నారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో మీకు వస్తే మీ పరిస్థితి ఏమిటని నిలదీశారు.

తూర్పుతాళ్లు.. గుండె ఘొల్లు

- గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి
- నలుగురు మృతి



తిరుమల నర్సింహమూర్తి, గురుజు మురళి మృతదేహాలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామంలో ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జనం కార్యక్రమం విషాదాంతం కాగా.. నలుగురు మృత్యువాత పడ్డారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కడియం దినేష్(9), గురుజు మురళి (38), ఈవన సూర్యనారాయణ (58), తిరుమల నర్సింహమూర్తి(35)లు మృతి చెందగా కంచర్ల ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాలను, క్షతగాత్రులను నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. మృతుల బంధువులు, గ్రామస్తులు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ఉదయం పదిగంటల నుంచి గ్రామంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. పాటలు పాడుతూ.. చిందులు వేస్తూ.. రంగులు చల్లుకుంటూ తమ కళ్ల ముందు ఉత్సాహంగా గడిపిన వారు రాత్రయ్యే సరికి విగత జీవులుగా మారడాన్ని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు. మృతులంతా.. ఒకే గ్రామానికి, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. మృతుల్లో తొమ్మిదేళ్ల బాలుడితో పాటు ఇద్దరు యువకులు ఉన్నారు. మృతులు నర్సింహామూర్తికి ఏడాదిలోపు వయసున్న కవల పిల్లలు, మురళికి ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నారు. నరసాపురం ప్రభుత్వాస్పత్రికి కల్టెర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద, ఎమ్మెల్యే నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు వచ్చి మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిమ్మ కేరాఫ్ అమ్మపాలెం

- గ్రామంలోని ప్రతి రైతుకూ నిమ్మతోటలు
- కుటుంబసభ్యులే సొంతంగా సేద్యం
- సిరులు కురిపిస్తున్న నిమ్మ పంట

జంగారెడ్డిగూడెం: నష్టాల నుంచి బయట పడేందుకు నిమ్మ వైపు మొగ్గారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరికింది. దీంతో ఆ గ్రామంలోని రైతులు అటుగా అడుగులు వేశారు. నేడు ప్రతి రైతుకు ఆ పంట సిరులు కురిపిస్తోంది. జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం నిమ్మ సిరులు కురిపిస్తోంది.

జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెంలో ప్రతి రైతు నిమ్మ పంటను పండిస్తున్నారు. గ్రామంలో సుమారు 100 ఇళ్లు ఉండగా, 150 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 100 మంది రైతులు ఉన్నారు. ప్రతి రైతుకు ఉన్న భూమిలో కొంత భూమిలో నిమ్మ పండిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే ప్రధానంగా నిమ్మపై ఆధారపడటమే కాక, కుటుంబసభ్యుల అంతా కలిసి వ్యవసాయం చేస్తారు. విద్యార్థులు కూడా ఖాళీ సమయాల్లో నిమ్మ తోటలకు వెళ్లి సొంతంగా కష్టపడుతారు. గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 600 హెక్టార్లు ఉండగా, దీనిలో 300 ఎకరాల్లో రైతులు నిమ్మ పంట వేశారు.

మిరప, పొగాకులో నష్టం రావడంతో..

సుమారు 20 ఏళ్ల క్రితం వరకు గ్రామ రైతులు మిరప, పొగాకు వేసేవారు. ఆ సమయంలో ఈ పంటలకు నష్టాలు రావడంతో ఒకరిద్దరు రైతులు ప్రయోగాత్మకంగా నిమ్మపంట వేశారు. అంతే


జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెంలో నిమ్మ తోటలు


జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెంలో ఇంటి పెరట్లో వేసిన నిమ్మచెట్లు

నిమ్మ సిరులు కురిపించింది. దశలవారీగా రైతులంతా తమ పంట భూమిలో కొంత నిమ్మ పంట వేశారు. మెరక పొలాలు, వరి పొలాల్లో కూడా నిమ్మ పంట వేశారు. ఎకరానికి సుమారు రూ.లక్ష ఆదాయం రైతులకు లభిస్తోంది. దీంతో నిమ్మపంట అమ్మపాలెం గ్రామానికి బంగారం పంటగా మారిపోయింది. ఇప్పుడు ఊరంతా నిమ్మ పంటపైనే ఆధారపడ్డారు. మరొక విశేషం ఏమిటంటే రైతు ఇంటి పెరట్లో ఖాళీ జాగా ఉంటే కచ్చితంగా ఒకటి రెండు నిమ్మ చెట్లు సెంటిమెంట్‌గా పెంచుతున్నారు. ఊరంతా రైతు కుటుంబాలే. వీరంతా ఒకే మాటపై కట్టుబడి ఉంటారు. అందరూ ఒకే కట్టుబాటును పాటిస్తూ ఏకతాటిపై ఉంటారు.

కుటుంబ సభ్యులంతా తోటల్లోకి వెళ్లి నిమ్మ కాయలు కోసి సంచుల్లో నింపి ఊర్లో రోడ్డుపక్కన ఉంచుతారు. నిమ్మకాయల వ్యాపారులు మోటార్‌సైకిళ్లపై వచ్చి ఒకొక్క రైతు నుంచి వరుసగా కొనుగోలు చేసుకుని ట్రక్కు ఆటోలో ఏలూరు, జంగారెడ్డిగూడెం నిమ్మ మార్కెట్‌కు తరలిస్తారు. అమ్మపాలెంలో పండే నిమ్మ పంట మంచి నాణ్యత కలిగి ఉంటుంది.

నిమ్మపైనే ఆధారం



“అమ్మపాలెం పంచాయతీ రైతులంతా నిమ్మ పంటపై ఆధారపడి ఉన్నాం. ఇది మా పంచాయతీకి బంగారు పంట. కుటుంబ సభ్యులంతా కష్టపడి సేద్యం చేస్తాం. మా పంచాయతీలో ప్రతి రైతుకు నిమ్మ పంట ఉంది. రైతులంతా కలిసి ఒకరికొకరు సహకరించుకుంటూ సేద్యం చేసుకుంటాం.

– కనపర్తి వెంకట సత్యనారాయణ, నిమ్మరైతు

నిమ్మ పంటకు నేల అనుకూలం



మా గ్రామం నిమ్మ పంటకు ప్రసిద్ధి. నిమ్మ పంటకు నేల బాగా అనుకూలంగా ఉంటుంది. దిగుబడి అధికంగా వస్తుంది. పండిన పంటను వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి ఏలూరు, జంగారెడ్డిగూడెం మార్కెట్‌కు తరలిస్తారు. మాకు ఈ పంట సిరులు కురిపిస్తోంది.

– సూరవరపు రాంబాబు, నిమ్మరైతు, సర్పంచ్, అమ్మపాలెం

క్లుప్తంగా

పెద్దింట్లమ్మా.. పాహిమాం


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. పాహిమాం.. అంటూ భక్తులు ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సమీప జిల్లాల నుంచి వేలాది భక్తులు అమ్మను దర్శించుకున్నారు. మేకలు, గొర్రెలను వేడి నైవేద్యాలుగా సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తలనీలాల వద్ద రద్దీ కనిపించింది. భక్తులు కోనేరు స్నానాలు ఆచరించి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ఈవో మాట్లాడుతూ వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.20,037 ఆదాయం వచ్చిందని తెలిపారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


పూల అలంకరణలో అమ్మవారు

పెదవేగి: రాట్నాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీరాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుము వలన రూ.44,080, విరాళంపై రూ.10,753, లడ్డూ ప్రసాదంపై రూ.18,000, పులిహోర ప్రసాదంపై రూ.1,380, ఫోటోలు రూ 2,455, మొత్తం రూ.76,668 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాల పొంగళ్శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించుకునే భక్తులు అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొంటే మేలు జరుగుతుందనే విశ్వాసం ఉంది.

వనితను పరామర్శించిన మాజీ ఎంపీ భరత్


పాలకొల్లులో తానేటి బాబూరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనితను వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ పరామర్శించారు. వనిత మామయ్య తానేటి బాబూరావు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. పాలకొల్లులోని బాబూరావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద భరత్ పుష్పాంజలి ఘటించారు. బాబూరావు భార్య జ్యోతమ్మ, పెద్ద కుమారుడు డాక్టర్ శ్రీనివాస్, వనిత దంపతులకు, అలాగే ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోడె నాగు పట్టివేత

జంగారెడ్డిగూడెం: లక్కవరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో కోడె నాగును పట్టుకున్నారు. ఆసుపత్రిలో పామును స్టాఫ్‌నర్సు గమనించి స్నేక్ సేవియర్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. సొసైటీకి చెందిన చదలవాడ క్రాంతి ఆసుపత్రికి చేరుకుని ఐదు అడుగులు పొడవు ఉన్న కోడె నాగును పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

విధి నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ మృతి


చిన్నవారిగూడెం సమీపంలో ఎర్రకాలువలో లభించిన బుడుపుల సుబ్బారావు మృతదేహం


గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న డీఎస్పీలు యు.రవిచంద్ర, ఎం.వెంకటేశ్వరరావు

ఎర్రకాలువ దాటుతుండగా గల్లంతు


మృతుడు బుడుపుల సుబ్బారావు(ఫైల్)

జంగారెడ్డిగూడెం: ఈ నెల 29 రాత్రి అదృశ్యమైన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఆచూకీ లభ్యమైంది. విధి నిర్వహణలో భాగంగా వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఎర్రకాలువలో కొట్టుకుపోయి మృతి చెందారు. దీనికి సంబంధించి డీఎస్పీ యు.రవిచంద్ర వివరించారు. జంగారెడ్డిగూడెం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని కామవరపుకోట, టి.నరసాపురం మండలాల్లో బుడుపుల సుబ్బారావు పోలీసు శాఖ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్వగ్రామం బుట్టాయగూడెం. ఈ నెల 29 రాత్రి కామవరపుకోట, టి.నరసాపురం మండలాల్లోని వినాయక చవితి మండపాలను పరిశీలించేందుకు వెళ్లారు. ఆ సమయంలో టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెం సమీపంలోని ఎర్రకాలువ సప్టా దాటుతుండగా, అకస్మాత్తుగా నీటి ఉధృతితో ఆయన ద్విచక్ర వాహనంతో సహా కొట్టుకుపోయారు. శనివారం ఉదయం వరకూ సుబ్బారావు నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబసభ్యులు తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం నుంచి సుబ్బారావు ఆచూకీ కోసం పోలీసు యంత్రాంగం ప్రయత్నించింది. రాత్రి వరకు ఎటువంటి ఆచూకీ లభించలేదు. డీఎస్పీలు యు.రవిచంద్ర, ఎం.వెంకటేశ్వరరావు, చింతలపూడి, జీలుగుమిల్లి సీఐలు, ఎస్సైలు అప్పలరాజుగూడెం ఎర్రకాలువలో గాలింపు చర్యలు పర్యవేక్షించారు. మత్స్యకారుల సాయంతో కాలువలో గాలించారు. కాలువలో ఒక చోట సుబ్బారావు బైక్ లభించగా, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం పంచాయతీ చిన్నవారిగూడెం సమీపంలో ఎర్రకాలువలో బుడుపుల సుబ్బారావు (48) మృతదేహం లభించింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సుబ్బారావు స్వగ్రామం బుట్టాయగూడెం తరలించారు.

బుట్టాయగూడెంలో విషాద ఛాయలు

బుట్టాయగూడెం: హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు భౌతికకాయానికి బుట్టాయగూడెంలో ఆదివారం రాత్రి ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుబ్బారావు భార్య మాలినిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అతని కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. మృధుస్వభావి, విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందిన సుబ్బారావు అకాల మృతితో ఒక్కసారిగా ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేకాట స్థావరాలపై దాడి

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు, మండపాక గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. వేల్పూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,250, మండపాక గ్రామంలో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సంప్రదాయ డ్రెస్ కోడ్ అమలు ఎప్పుడు?

- పలు ప్రముఖ ఆలయాల్లో అమలవుతున్న డ్రెస్ కోడ్
- ద్వారకాతిరుమలలో నేటికీ అమలు కాని విధానం


టార్న్ జీన్స్ ప్యాంట్‌తో ఉన్న యువకుడు


టీషర్ట్‌తో బయటకు వస్తున్న యువతి

ద్వారకాతిరుమల: సంస్కృతి, సంప్రదాయాలకు హిందూ ఆలయాలు పెట్టింది పేరు. భక్తులు ఒకప్పుడు ఆలయాలకు సంప్రదాయ దుస్తుల్లోనే వెళ్లేవారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో రకరకాల మోడల్ దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో కొందరు యువతి, యువకులు, మహిళలు, పురుషులు సంప్రదాయాలకు విరుద్ధమైన దుస్తుల్లో ఆలయాలకు వెళుతున్నారు. దీని కారణంగా దేవాలయాల పవిత్రతకు భంగం కలుగుతోంది. దీనిపై దృష్టి సారించిన రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు ఇటీవల విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో డ్రెస్ కోడ్‌ను ప్రవేశపెట్టారు. పంచె, కండువా ధరించిన పురుషులను, చీరలు, లంగా ఓణీ, చుడీదార్ వంటి సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలను, యువతులను మాత్రమే ఆలయంలోకి అనుమతిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ఎన్నో ఆలయాల్లో ఈ డ్రెస్‌కోడ్ ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయితే చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో మాత్రం నిత్యార్జిత కల్యాణంలో పాల్గొనే భక్తులకు మాత్రమే డ్రెస్ కోడ్ అమలులో ఉంది. స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వెళ్లే భక్తులకు ఎటువంటి డ్రెస్ కోడ్ లేదు. దాంతో కొందరి భక్తుల వస్త్రధారణ ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు భంగం కలిగిస్తున్నాయి. కొందరు యువతులు, మహిళలు జీన్స్ ప్యాంట్లు, గౌన్లు, స్లీవ్ లెస్ డ్రస్‌లు వేసుకొస్తున్నారు. కొందరు యువకులు చిరిగిన జీన్స్ ప్యాంట్లు, టీషర్ట్‌లు, ఇలా రకరకాల మోడల్స్ దుస్తుల్లో ఆలయానికి వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రీవారి ఆలయంలో డ్రెస్ కోడ్ అమలు చేసి, ఆలయ పవిత్రతను కాపాడి, భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను మరింతగా పెంపొందించాలని పలువురు కోరుతున్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

వీరవాసరం: గణపతి నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని నడపనవారిపాలెంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై వివాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా.. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. నడపనవారిపాలెంలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారంతా వారి ప్రాంతంలో చవితి ఉత్సవాలను ఏర్పాటు చేసుకున్నారు. మరో సామాజిక వర్గం వారు ప్రధాన రహదారిపై రామాలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన రహదారి వద్ద ఒక సామాజిక వర్గం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఫ్లెక్సీలను ఇక్కడ పెట్టవద్దంటూ మరో సామాజిక వర్గం యువకులు అడ్డుకున్నారు. ఫ్లెక్సీలు తీయకపోవడంతో మరో వర్గం యువకులు ఆ ఫ్లెక్సీలు తొలగించి పక్కన పెట్టారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు ఏర్పడ్డాయి. ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన పలువురికి తీవ్ర గాయాలు పాలయ్యారు. ఒక వర్గం వారు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మరో వారు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలకు సయోధ్య కుదర్చడానికి మండలానికి చెందిన నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓపెన్ కేటగిరీలో ఎంపిక చేయాలి


తాడేరులో దళిత ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న గంటా సుందర్‌కుమార్

భీమవరం అర్బన్: డీఎస్సీ ఉద్యోగాల్లో మెరిట్ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరి ద్వారానే నియమించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తాడేరులో దళిత ఐక్య వేదిక భీమవరం మండల శాఖ ముఖ్య నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ జీవో నెం. 77 ప్రకారం డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా పోస్టులు భర్తీ చేయడం లేదని ఆరోపించారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరిలో రిజర్వేషన్ల ప్రకారం రావాల్సిన ఉద్యోగాలు అభ్యర్థులకు రాకుండా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పారదర్శకంగా నిర్వహించవలసిన ఉద్యోగాల భర్తీని సీక్రెట్‌గా నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గొల్లా రాజ్‌కుమార్, జె. విజయకుమార్, కె. కళ్యాణ్, ఎ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సెలవుదినం కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. అయితే ఈవారం అష్టమి తిథి కావడంతో నామమాత్రంగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. దాంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, కల్యాణకట్ట తదితర విభాగాల్లో భక్తుల రద్దీ స్వల్పంగా కనిపించింది. వచ్చే ఆదివారం చంద్ర గ్రహణం కావడంతో అప్పటి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నామమాత్రంగానే ఉండొచ్చని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

అధిక యాంటీ బయోటిక్‌తో ముప్పు

పశువుల్లో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశు వైద్యులు



కొయ్యలగూడెం: పశువులకు చేసే వైద్యంలో మోతాదుకు మించిన యాంటీ బయోటిక్స్ వాడకం ఎక్కువవుతుందని దీని వల్ల పశువుల ఆరోగ్యం క్షీణించడంతోపాటు పాల ఉత్పత్తి పడిపోతుందని యర్రంపేట వెటర్నరీ డాక్టర్ పి.అపురూప పేర్కొన్నారు. యాంటీ బయోటిక్స్ వాడకం, అవగాహనపై రైతులకు పలు సూచనలు చేశారు.

యాంటీ బయోటిక్ నిరోధకత తీవ్రమైన ప్రపంచ సంక్షోభం. ఇది మానవ, జంతు ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది. పశువుల పెంపకంలో యాంటీ బయోటిక్స్‌ను విరివిగా, తరచూ ఉపయోగించడం వల్ల బ్యాక్టీరియాను తట్టుకునేలా పశువులలో ఇమ్యూనిటీ బలహీన పడుతుంది. ఫలితంగా సాధారణ ఇన్ఫెక్షన్లకు కూడా యాంటీబయాటిక్స్ పనిచేయదని, ఇది చికిత్సను సంక్లిష్టం చేస్తుందన్నారు. రోజు రోజుకు బాక్టీరియాలో పెరుగుతున్న నిరోధకతను సరైన అవగాహనతో అరికట్టడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. బాక్టీరియాలో నిరోధతకు ప్రధాన కారణాలు యాంటీ బయోటిక్స్ సులభంగా, చౌకగా లభించడంతో వాడకందారులు ఎక్కువగా వాటిని ఉపయోగిస్తున్నారు.


మోతాదుకు మించిన యాంటీబయోటిక్‌తో ఏర్పడ్డ పుండుకి శస్త్రచికిత్స చేస్తున్న దృశ్యం

మోతాదు మించి వాడకంతో తగ్గుతున్న రోగ నిరోధకత

యాంటీ బయోటిక్స్ దుర్వినియోగంపై ప్రజల్లో అవగాహనా లేకపోవడం పశువుల పాలిట యమపాశం అవుతుంది. పశువులకు ఇచ్చిన యాంటీబయాటిక్‌ల అవశేషాలు మాంసం, పాలు లేదా ఇతర ఉత్పత్తుల ద్వారా మనుషుల శరీరంలోకి ప్రవేశించి, వారిలో కూడా యాంటీబయాటిక్ అవశేషాలు వ్యాధి నిరోధకతను తగ్గిస్తాయి. సరైన మోతాదులో యాంటీ బయోటిక్‌లు ఇవ్వకపోవడం లేదా చికిత్సను మధ్యలో ఆపడం వల్ల, బలంగా ఉండే బ్యాక్టీరియా బతికి, నిరోధకతను అభివృద్ధి చేస్తుందిరు. నిరోధకత పెరగడం వల్ల, పశువులలో సాధారణ వ్యాధులను కూడా నయం చేయడం కష్టమవుతుంది. పశువులు అనారోగ్యానికి గురికావడం లేదా మరణించడం వల్ల రైతులకు భారీగా నష్టం కలుగుతుంది.

ప్రత్యామ్నాయాలపై దృష్టి

బ్యాక్టీరియాను చంపడానికి యాంటీ బయోటిక్‌కు ప్రత్యామ్నాయలపై ఇటీవల పరిశోధనలు పెరిగాయి. నానో టెక్నాలజీ, మొక్కల నుంచి లభించు పదార్థాలతో యాంటీ బయోటిక్ నిరోధకతను ఎదుర్కొనడం, ప్రో బయోటిక్స్ మొదలగు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాంటీ బయోటిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. యాంటీ బయోటిక్స్ పశు వైద్యుడి సలహా మేరకు లేదా పశువైద్యుడి సంరక్షణలో మాత్రమే ఉపయోగించాలి., పశువులు వ్యాధి లక్షణాల నుంచి తేరుకునప్పటికి ముందుగా పశు వైద్యులు సూచించిన యాంటీ బయోటిక్స్ కోర్సు పూర్తిగ వాడాలి. యాంటీ బయోటిక్స్ నియంత్రణకు మార్గదర్శకాలు అవసరమన్నారు. ఇప్పటికే మార్గదర్శకాలు రూపొందిస్తున్నారని, అది సఫలమైతే రైతులకు వరంగా మారుతుంది.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం



“నవంబర్ నెలలో ప్రపంచ యాంటీబయాటిక్ అవేర్‌నెస్ వీక్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు, రైతులలో అవగాహన పెంచుతోతున్నాం. ఇందుకు మోడల్‌గా కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకుని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. దీనిపై రిజల్ట్ అనుకూలంగా వస్తే శివారు గ్రామాలలో కూడా కార్యక్రమాలు విస్తరిస్తాం.

పి.అపురూప, పశువైద్యధికారి, యర్రంపేట పశువైద్యశాల

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు


ఫెన్సింగ్ పోటీల దృశ్యం

భీమవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు భీమవరంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఖేలో ఇండియాలో భాగంగా విద్యార్థిని ధృతి సమీక్షకు చెక్కు అందజేశారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఎన్.సుగుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఏలూరు విద్యార్థిని


పోటీలకు ఎంపికైన నందిని

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థిని పి.నందిని జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 14 నుంచి 17 వరకూ పిఠాపురంలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో నందిని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటిందని గుర్తు చేశారు. ఈ నెల 2 నుంచి 9 వరకూ పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరిగే జాతీయ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జిడ్డు హరిబాబు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విచ్చేస్తారని, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇంటికే ఉచిత వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రాజేంద్ర ప్రత్యేక వాహనం ద్వారా 10 మంది రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. దాత కాకరపర్తి సత్యవతి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక భద్రత సేవలో జీవిత బీమా



గరికిపాటి బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీఓ సీ): గడిచిన 69 సంవత్సరాలుగా దేశ ప్రజలకు ఆర్థిక భద్రత, ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయలు చేయూతనిస్తూ ప్రభుత్వ రంగ అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత బీమా (ఎల్ఐసీ) అభివృద్ధి చెందిందని ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు గరికిపాటి బాపయ్య శర్మ వెల్లడించారు. 1956లో రూ.5 కోట్ల పెట్టబడితో ప్రారంభించి, నేడు రూ.54 లక్షల కోట్ల పెట్టుబడితో ప్రపంచ స్థాయి బీమా సంస్థగా ఎదిగిందన్నారు. రూ.40కోట్ల పెట్టుబడిదారులకు ఆర్థిక భరోసా అందిస్తుందని తెలిపారు. బీమా ప్రీమియం విషయంలో జీఎస్టీని తొలగించాలని, ఎల్ఐసీని మరింత పటిష్టంగా అభివృద్ధి చేసి కాలానుగుణంగా ఉద్యోగుల భర్తీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రసాయనాలు వద్దు.. కషాయాలు ముద్దు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంటపాడు: రసాయనాల సేద్యం కన్నా ప్రకృతి కషాయాలై తమకు ఎంతో ఇష్టమని మీనవిల్లూరు ప్రాంత రైతులు నినదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం సేద్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మీనవిల్లూరు గ్రామంలో రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ గూడెం జోనల్ కో-ఆర్డినేటర్ గద్దే వెంకటరత్నం, పెంటపాడు మండల ఇన్‌చార్జి గుమ్మళ్ల వీర్రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సుబ్బారావు, కోడి హరికృష్ణ, కోన శ్రీను, ఉండవల్లి శ్రీను, మంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీవీ రామకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు ఎంఈఓగా పనిచేస్తున్న తాడేపల్లిగూడేనికి చెందిన తాళ్లూరి వెంకట రామకృష్ణ హైదరాబాద్‌లో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీ (శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం) డాక్టర్ ఎన్టీఆర్ కళా మందిరంలో గౌరవ డాక్టరేట్ అవార్డును ఇచ్చారు.

నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు గడచిన ఐదేళ్లుగా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రతి నెలా నిరు పేదలు, వృద్ధులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో గొంతు క్యాన్సర్ కారణంగా గత కొంతకాలంగా పనికి వెళ్లక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కొప్పిశెట్టి సూరయ్య కుటుంబానికి ఈ నెల నుంచి కొత్తగా నిత్యావసరాలు పంపిణీ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి ముద్దల రాధాకృష్ణ తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షులు ఓదూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ నెల సరుకులు పంపిణీ చేసినట్లు రాధాకృష్ణ తెలిపారు.

ఎటు చూసినా అడవులే



అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం



మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- మున్సిపల్ అధికారులు స్పందించాలి

తాడేపల్లిగూడెం : పట్టణంలోని 35 వార్డుల్లోని ఖాళీ జాగాలు అడవులను తలపిస్తున్నాయి. వాడకం నీరు, వాన నీరు చేరి మడుగుల్లా మారుతున్నాయి. దోమలకు, వరాహాలకు, సర్ప రాజాలకు ఆవాసంగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ సర్పాలు అప్పుడప్పుడూ సర్పాలు రహదార్ల పైకి వచ్చి ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి. వరాహాలు పురుడు పోసుకొనే (ఈనే సమయంలో) భీతావహ వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇక దోమల సంగతి చెప్పనక్కర్లేదు. జనం రక్తాన్ని పీడించి, రోగాలు రప్పిస్తున్నాయి. అసలే జ్వరాల సమయం. వైరల్‌తో పాటు డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో వార్డుల్లో ఉన్న బుష్ క్లియరెన్సు విషయంలో మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో నివాస గృహాల కంటే ఖాళీ స్థలాలే ఎక్కువ. కొనడం, వదిలి పారేయడం యజమానులకు రివాజుగా మారింది. ఆ ఖాళీ జాగాల పరిసర ప్రాంతవాసులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, స్థల యజమానులు పట్టించుకోరు. స్థలాలను శుభ్రం చేయించరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఊర్లో మా స్థలం ఒకటే ఉందా. మిగిలిన స్థలాలు లేవా అనే ముదర సమాధానాలు చెబుతున్నారు. జంగిల్‌గా మారిన ప్రాంతాల నుంచి ప్రమాదకరమైన కట్ల పాములు బయటకు వస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటితో పాటు జర్రిగొడ్లు ప్రజలను భయపెడుతున్నాయి. పామరుల సంగతి ఎలా ఉన్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, బ్యాంకుల్లో ఉద్యోగాలు, ఉద్యోగ విరమణ చేసిన వారు విచక్షణ, వివేచన లేకుండా వారి జాగాలను శుభ్రం చేయకుండా అలాగే ఉంచుతున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు కూడా పిచ్చి మొక్కలతో నిండి కనిపిస్తున్నాయి. ఆ కార్యాలయాల పర్యవేక్షక అధికారుల్లో స్పందన లేదు.

హెచ్చరిక బోర్డులకు స్పందన లేదు

ఖాళీ స్థలాల పన్ను బకాయిలు చెల్లించాలి. జంగిల్ క్లియరెన్సు చేయాలి, లేదంటే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఎవరూ బేఖాతరు చేయడం లేదు. దీంతో అవి ప్రదర్శనలకే పరిమితమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

> **యజమానులకు నోటీసులు ఇస్తున్నాం**
>
> ఖాళీస్థలాల్లో జంగిల్ క్లియరెన్సు విషయంలో యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. తగినంత తక్కువ సమయంలోనే వీటిపై చర్యలు చేపడతాం.
>
> – ఎం.ఏసుబాబు, కమిషనర్

ఘనంగా ఆరుద్ర శత జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కరరావు

తణుకు అర్బన్: సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత ఆరుద్ర శత జయంతిని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ సాహిత్య కారణ జన్ముడు ఆరుద్ర గీతాలు మానవత్వానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు, కవి సంకు మదనగోపాల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మార్లపూడి దివ్య పాల్గొన్నారు.

మన్ కీ బాత్ వీక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మహాత్మా గాంధీ శక్తి కేంద్రంలో మన్ కీ బాత్‌ను ఆన్‌లైన్‌లో వీక్షించారు. బీజేపీ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను, కో-కన్వీనర్ రామగాని సత్యనారాయణ, పట్టణ సెక్రటరీ తుమరాడ చిన్న, పెంటపాడు జనరల్ సెక్రటరీ ఆరాధ్యుల అంజి, పట్టణ కమిటీ సభ్యులు యార్నాల సూరిబాబు, రెడ్డి బుల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఫిట్‌గా ఉండాలి



తణుకులో సైక్లింగ్ నిర్వహించిన సీఐ కొండయ్య

తణుకు అర్బన్: పోలీసు విధుల్లో ఆరోగ్యపరంగా ఎంతో ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉందని తణుకు పట్టణ సీఐ ఎన్.కొండయ్య అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు సర్కిల్ కార్యాలయం నుంచి నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, మానసికంగాను, శారీరకంగాను సమస్యలు ఎదురవుతాయని అన్నారు. అటువంటి పరిస్థితులను అధిగమించే క్రమంలో పోలీసులు ఫిట్‌గా ఉండేందుకు ప్రతి రోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి వ్యాయామం, రన్నింగ్, యోగ, ధ్యానం వంటివి ఆచరించాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. ఆరోగ్యం బావుంటేనే కుటుంబం బావుంటుందని వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పాటు డీఎస్పీ సూచనలతో ఈ రోజు ఫిట్ ఇండియా కార్యక్రమంలో సైక్లింగ్ చేపట్టినట్లు చెప్పారు. ఇకపై సిబ్బంది అంతా శారీరక శ్రమకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ ఇచ్చి ఆదుకోరూ..



సదరం సర్టిఫికెట్లతో భాగ్యలక్ష్మి, సాయి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగవైకల్యాలు, మానసిక ఇబ్బందులతో పాటు అనారోగ్యాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని పింఛన్లను ఇచ్చి ఆదుకోవాలని హౌసింగ్ బోర్డు శివారులో ఉంటున్న నారి భాగ్యలక్ష్మి, ఆమె కుమారుడు నారి సాయి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్లు తీసుకున్నారు. పింఛన్ విషయమై ఎన్ని సార్లు సచివాలయం చుట్టూ తిరిగినా, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. సచివాలయానికి వెళ్లిన ప్రతి సారి ఇప్పుడు కాదు తరువాత రావాలంటూ తిప్పుతున్నారని, నమోదు చేసుకునేందుకు ఇంకా సమయం ఉందని అంటున్నారని వాపోయారు. సంవత్సరం నుంచి పింఛన్ ఇప్పించమని తిరుగుతున్నామని, ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామని పింఛన్ ఇచ్చి తమను ఆదుకోవాలని వాపోతున్నారు.

భాగ్యలక్ష్మి తండ్రి మృతి, తల్లికి అనారోగ్యం

భర్త వదిలి వేయడంతో దివ్యాంగురాలైన భాగ్యలక్ష్మి, మానసిక వైకల్యంతో బాధపడుతున్న తన కుమారుడు సాయితో కలిసి తొలుత ఆమె తల్లిదండ్రుల వద్ద వీకర్స్‌కాలనీ 1వ వార్డులో అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. అయితే ఇటీవల భాగ్యలక్ష్మి తండ్రి ఇస్త్రీ చేసుకుంటూ జీవిస్తున్న సుబ్బారావు అకాల మరణం చెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. చేసేది లేక అక్కడి నుంచి హౌసింగ్ బోర్డు 35వ వార్డు శివారు ప్రాంతంలో చిన్న షెడ్డులో అద్దెకు ఉంటున్నారు. భాగ్యలక్ష్మికి కుడి కాలు, కుడి చేయికు వైకల్యం ఉంది. కుమారుడు సాయికి వైకల్యంతో పాటు ఆస్తమా, ఇతర అనారోగ్య సమస్యలు రావడంతో ఆసుపత్రి పాలవుతున్నారు. భాగ్యలక్ష్మి తల్లి దుర్గమ్మ అనారోగ్యంతో బాధ పడుతూ వీరితోనే జీవిస్తుంది. వీరిని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీనివాసరావు కవితకి ఎక్స్ రే అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: విజయవాడకి చెందిన ఎక్స్ రే సాహిత్య సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ కార్యదర్శి, ప్రముఖ కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు రచించిన గెలుపోటముల ఆట అనే కవితకు ఉత్తమ కవితా అవార్డు వచ్చింది. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 358 కవితలు రాగా ఈ కవిత 3 వ స్థానంలో నిలిచి అవార్డుకి ఎంపికైంది. ఆదివారం విజయవాడ స్వాతి బిల్డింగ్స్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, డిప్యూటీ కలెక్టర్ కృష్ణవేణి, ఎక్స్‌రే సంస్థ అధ్యక్షుడు కొల్లూరి చేతుల మీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

అమ్మవారి పసుపు, కుంకుమ పంపిణీ

యలమంచిలి: గ్రామ దేవత పుంతల ముసలమ్మ అమ్మవారికి శ్రావణ మాసంలో జరిగిన పూజల్లో వినియోగించిన పసుపు, కుంకుమలను ఆదివారం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో కూర్చుని లలిత సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో పార్టీ నాయకులు సప్పా బలరామకృష్ణ నివాసంలో ఆదివారం నిర్వహించిన కాఫీ విత్ కారుమూరి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ గడపలోకి వెళ్లినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అందించిన సంక్షేమాన్ని మేము ఎన్నడూ మరువలేమని, ఆయన పార్టీకి మేము వేసిన ఓట్లే మైపోయాయని ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి నెలకొందని స్పష్టం చేశారు. సంక్షేమ ప్రదాతగా తండ్రిని మించి సంక్షేమాన్ని అందించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని ఆ గొప్పతనాన్ని ప్రజలు గుర్తుంచుకున్నారన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం ఉత్సాహంగా పని చేయాల్సిన పరిస్థితులు వస్తాయని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రతి వార్డులోనూ అనుబంధ విభాగాల కమిటీలు పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పార్టీ కమిటీల్లో చేరేందుకు కార్యకర్తలు ఉత్సాహం చూపిస్తున్నారని, పనిచేసే వారికి మంచి స్థానాలు కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లోనూ పర్యటిస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా ఆర్గనేజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, చోడే గోపీకృష్ణ, మెహర్ అన్సారీ, పైడి సాయి సూర్య, షేక్ జిలానీ, గెద్దాడ శ్రీకాంత్, నాసరి పార్థసారధి, కొమ్మోజు రామకృష్ణ, కాకరపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురి అరెస్టు

తణుకు అర్బన్: తణుకు మండలం కోనాల గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన గెద్దం వెంకన్నబాబు, అతడి సోదరుడు గెద్దం సాయి శుక్రవారం రాత్రి గెద్దం పండు, అతడి తండ్రి గెద్దం వెంకటేశ్వరరావులపై దాడి చేశారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ ఘర్షణకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్సై చంద్రశేఖర్ వెల్లడించారు.

క్రీడల్లో పేదలకు తోడ్పాటు అందించాలి



పడాల ప్రహ్లాద రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నూతన కార్యవర్గ సభ్యులు

పెనుమంట్ర: పడాల ప్రహ్లాదరెడ్డి ఆశయ స్ఫూర్తి లక్ష్యంగా కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేసి, క్రీడల్లో పేదలకు తోడ్పాటునివ్వాలని ప్రహ్లాదరెడ్డి మెమోరియల్ బాస్కెట్‌బాల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు అల్లం బుల్లిరెడ్డి అన్నారు. ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం మార్టేరు రోటరీ భవనంలో నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుల్లి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారంటే ప్రహ్లాదరెడ్డి ఆనాడు విద్యార్థులకు ఇచ్చిన తర్ఫీదు కారణమన్నారు. అనంతరం సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ ఎస్వీజీ పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి పరిస పేద క్రీడ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ సమ్మర్ క్యాంపులు నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మూడేళ్ల పాటు ఉండే ట్రస్ట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా అల్లం బుల్లి రెడ్డి, సత్తి సుబ్బన్న రెడ్డిలతోపాటు నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు.

ఓటు చోరీ దుర్మార్గపు చర్య



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకుడు వర్మ

తణుకు అర్బన్: ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థకు కీలకమైన ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తూ ఓట్ చోరీకి పాల్పడడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని సామాజిక విశ్లేషకుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. స్థానిక సురాజ్య భవన్‌లో ఆదివారం ఓట్‌చోరీపై నిర్వహించిన చర్చా గోష్ఠికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా 65 లక్షల మందిని తొలగించి ఓట్ల చోరీకి పాల్పడిందని, సవరించిన జాబితాలో ఇంటి నంబర్లు, తల్లిదండ్రుల పేర్లు లేని వారు, చిన్న చిన్న నివాసాల్లో వందల సంఖ్యలో అనర్హమైన వారిని ఓటర్లుగా చేసిందని విమర్శించారు. పేదలు, వలస కూలీలు, మైనారిటీల ఓటు హక్కును తొలగించిందని విమర్శించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యదర్శి చోడే గోపీకృష్ణ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండి తీరాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించే విధంగా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, సీపీఎం నాయకులు ఎ.అజయకుమారి, కామన మునుస్వామి, దిర్సిపో రామకృష్ణ, రామారావు, రామకృష్ణంరాజు, జి.మధు పాల్గొన్నారు.

వరి పంటను వీడని ముంపు



ముంపు నుంచి తేరుకోని పంట పొలాలు

పెంటపాడు: ఈ నెల 18 నుంచి మూడు రోజులు, అటు తరువాత వినాయక చవితి ముసురు వలన పంట పొలాలు నీట మునిగిన విషయం విధితమే. పెంటపాడు మండలంలో అత్యధికంగా నాట్లు దెబ్బతిన్నాయి. నాటిన నెల అనంతరం రైతులు ఒక కోటా మందు వేశారు. చేలు ఇప్పుడిప్పుడే దుబ్బు చేస్తున్నాయి. అయితే వర్షాలతో పాటు, ముంపునీరు డ్రెయినేజీల ద్వారా లాగక ప్రధానంగా పెంటపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి ప్రాంతాలలో భారీగా నాట్లు దెబ్బతిన్నాయి. ఒక కోటా మందు వేసిన తరువాత ఈ నష్టం జరగడంతో ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి వెళ్లారే తప్ప రైతులను ఆదుకొనేందుకు ఏ ప్రకటనా చేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 24 వేల ఎకరాలకుగానూ సుమారు 7 వేల ఎకరాలకు పైనే పంట నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే పెంటపాడు, కె. పెంటపాడు ఆయకట్టు పొలాలు మాత్రం వరి దుబ్బులు సుమారు 60 శాతం పైగా దెబ్బతిన్నాయి. ఈ నష్టం నుంచి గట్టెక్కేందుకు రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మరలా నాట్లు వేసేందుకు నారు సిద్ధంగా లేదు. అయితే ఈ తరుణంలో మరోసారి నారుమడులు వేసేందుకు సిద్ధపడుతున్నారు. అయితే పంట చేతికి వచ్చే సమయం మరో నెల పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నరసాపురంలో పారిశుద్ధ్యం అధ్వానం



బీజీబీఎస్ మహిళా కళాశాల రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగిపోయిన దృశ్యం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. పట్టణంలో మొత్తం 48 వరకూ మురికివాడలు ఉన్నాయి. ఈ మురికివాడల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత అధ్వానంగా ఉంది. దీనికి తోడు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సవ్యంగా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్‌పేట, నందమూరి కాలనీ, 22వ వార్డు కొత్తకాలనీ, గ్రేస్ నగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ఇక 29వ వార్డు అరుంధతీ పేటలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. అపారిశుద్ధ్యం కారణంగా పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు. సాక్షాత్తు మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్లపై చెత్త దర్శనమిస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత వానాకాలంలో డ్రెయిన్స్ పరిస్థితి దారుణంగా ఉంది. ఇక ప్రధాన ప్రాంతాల్లో కూడా రోడ్డుపక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయి, దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు

స్వచ్ఛ భారత్ అంటూ ఓ వైపు హడావిడి చేస్తున్న స్థానిక మునిసిపాలిటీ అధికారులు చెత్తసేకరణలో లోపాలు మాత్రం సరిద్దిడం లేదు. చెత్తసేకరణ విషయంలో లోపాలను సరిదిద్దితే పారిశుద్ధ్యం అంశంలో చాలా సమస్యలకు మోక్షం కలుగుతుందని పట్టణ వాసులు చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తడిచెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తామని, పారి శుద్ధ్య నిర్వహణలో కొత్త పంథాను తీసుకొస్తామని ఓ వైపు అధికారులు చెబుతున్నా అవన్నీ ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయోననేది ప్రశ్నార్థకంగా నిలుస్తుంది. ప్రస్తుతం మునిసిపాలిటీలో శానిటరీ సెక్షన్‌లో 73 మంది పర్మినెంట్ వర్కర్లు, మరో 91 మంది కాంట్రాక్ట్ వర్కర్లు పని చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు శాతంలో పెద్ద గోల్‌మాల్ జరుగుతుందనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. దీనిపై పురపాలకులు గానీ, అధికారులు గానీ నోరుమెదపని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కన్పిస్తుంది. ముఖ్యంగా శానిటరీ మేస్త్రిల పనితీరు అధ్వానంగా ఉంది. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విషయంలో ఇప్పటి వరకు ప్రజలకు సరైన రీతిలో అవగాహన కల్పించిన సందర్భం కూడా లేదు. పట్టణంలో ఏవార్డులో కూడా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.